

కవిసమ్మేళనం

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో వక్తలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక అన్నమయ్య కూడలిలోని గ్రేడ్ 1 శాఖ గ్రంథాలయంలో ఆదివారం ప్రజా కళావేదిక వ్యవస్థాపకులు అరవ జయపాల్, గ్రందాలయాధికారి జె.శివప్రసాద్‌ల ఆధ్వర్యంలో కవిసమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ కవి, రచయిత వి.ఆర్. రాసాని, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యులు, డాక్టర్ డి.యువశ్రీ, సహాయ ఆచార్యులు, పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం, తిరుపతి సీనియర్ జర్నలిస్టు శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షులు గుత్తా హరి సర్వోత్తమ నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వి.ఆర్. రాసాని మాట్లాడుతూ పుస్తకమే గురువు, స్నేహితుడు అన్నారు. సామాజిక జీవన మార్గదర్శి జనానోపదేశం చేసే తల్లి తండ్రిలాంటిదన్నారు. ఎదురీత అస్త్రమైతే అనే స్వీయ కవితను వినిపించారు. డాక్టర్ డి.యువశ్రీ మాట్లాడుతూ జ్ఞానమే నిజమైన సంపద అన్నారు. ఆలోచనల విస్తరణకు వ్యక్తిత్వ వికాసానికి పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. డిజిటల్ గ్రంథాలయాల యుగంలోకూడ ముద్రిత అక్షరాల ప్రాధాన్యత తగ్గలేదన్నారు. గుత్తా హరి సర్వోత్తమ నాయుడు మాట్లాడుతూ పుస్తకమున్నచోట వెలుగు వుంటుందన్నారు. నాగరికతకు గుర్తు అక్షర జ్ఞానమే అన్నారు. అరవ జయపాల్ మాట్లాడుతూ పుస్తక అధ్యయనంతోనే సామాజిక చైతన్యం సాధ్యమన్నారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన కవులు వారి కవిత్వాలు ఆలపించగా, జానపద కళాకారులు పాటలతో కార్యక్రమాన్ని రంజింప చేశారు. తదనంతరం గ్రంథాలయాధికారి జె.శివ ప్రసాద్ కవులు జాన పద కళా కారులను మొమెంటోలతో సన్మానించారు. చివరగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి విచ్చేసిన కవులందరినీ సన్మానించడం చాల సంతోషంగా వుందన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

ఆలయ ప్రాంగణంలో సమాచార శాఖ కమిషనర్ కృష్ణ తేజ ఐఏఎస్, సూర్యకాంత్ చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా, సజ్జనార్ తెలంగాణ కమిషనర్ ఆఫ్ పోలీస్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆదివారం పలువురు ప్రముఖులు విచ్చేశారు. సమాచార శాఖ కమిషనర్ కృష్ణ తేజ ఐఏఎస్, సూర్యకాంత్ చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా, సజ్జనార్ తెలంగాణ కమిషనర్ ఆఫ్ పోలీస్ లు కుటుంబ సమేతంగా విచ్చేయగా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ సాంప్రదాయ స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తదనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలకగా, సాయి ప్రసాద్ ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

జనసేనను విస్తరిస్తాం

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జనసేన పార్టీని మరింత విస్తరిస్తామని శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో భాగంగా పట్టణ, మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పార్టీ ఆశయాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో మీడియా సహకారం అత్యంత కీలకమని సాయి ప్రసాద్ అభిప్రాయపడ్డారు. ప్రజలకు వాస్తవమైన సమాచారం చేరేలా మీడియా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కుమార్, గరికపాటి చంద్ర, జయ ప్రకాష్, మహేష్, పసుపులేటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

టిటిడి పరకామణి కుంభకోణంపై

హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- మాజీ టీటీడీ ఏవీఎస్ఓ సతీష్ కుమార్ హత్యపై సమగ్ర విచారణ చేయాలి
- జర్నలిస్టు శ్రీనివాసరావుకు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : టీటీడీ పరకామణి కుంభకోణం కేసుపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, టీటీడీ మాజీ ఏవీఎస్ఓ సతీష్ కుమార్ హత్యకు కారకులైన వారిపై సమగ్ర విచారణ జరిపించి శిక్షించాలని, పరకమణి కేసు వెలుగులోకి తీసుకువచ్చిన సీనియర్ జర్నలిస్టు శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వం భద్రత కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం వేమన విజ్ఞాన కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. పరకామణి కేసు హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రౌండ్ టేబుల్ సమావేశానికి కాంగ్రెస్, ఆర్.పి.ఐ, సిఐటియు, మహిళా సంఘాలు సభ్యులు హాజరయ్యారు ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ టీటీడీ పరకామణి కుంభకోణం చాలా పెద్దదని, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో దీనిపై విచారణ జరిపిస్తే తప్ప అసలు వాస్తవాలు బయటకు రావని తెలిపారు. ఈ కుంభకోణంలో ఉన్న రవికుమార్ టిటిడికి 140 కోట్ల రూపాయల ఆస్తులు రాసి ఇవ్వడం చర్చనీయాంశంగా మారిందన్నారు. 35 సంవత్సరాలుగా టీటీడీ పరకామణిలో పనిచేస్తున్న రవికుమార్ కేవలం అమెరికన్ డాలర్లు దొంగతనాలు చేసి వాటిని ఇతర దేశాల్లో మార్పిడి చేసుకుని ఆస్తులు సంపాదించుకున్నారని, రవికుమార్‌తో పాటు మరికొంతమంది ఇందులో పాత్ర ఉందని దీనిపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించి పరకామణి వ్యవస్థను ఆధునికరించాల్సిన అవసరం ఉందన్నారు. హత్యకు గురైన టిటిడి మాజీ ఏవీఎస్ఓ సతీష్ కుమార్ ఎలా చనిపోయాడో దానిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి దోషం కఠినంగా శిక్షించాలన్నారు. టీటీడీ పరకామణి కేసును వెలుగులోకి తీసుకొచ్చిన జర్నలిస్టు శ్రీనివాసులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో శ్రీవాణి ట్రస్ట్‌లో నిధుల అవకతవకలు జరుగుతున్నాయని జర్నలిస్ట్ శ్రీనివాసులు తన పత్రికలో ప్రచురిస్తే అతనిపై గత టిటిడి పాలకమండలి అధికారులు తప్పుడు పేరుతో గంజాయి కేసులో ఇరికించి 17 రోజులు పాటు నెల్లూరు జైల్లో ఉంచారని గుర్తు చేశారు. పరకామణి కేసులో కూడా జర్నలిస్టు శ్రీనివాసులు హైకోర్టుని ఆశ్రయించారని దీనిపై హైకోర్టు స్పందించి శ్రీనివాసులు అనుకూలంగా తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. శ్రీనివాసులు కూడా భద్రత కల్పించి అతనికి ప్రాణహాని కలగకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ..

పరకామణిలో కుంభకోణం జరుగుతోందని జర్నలిస్టు శ్రీనివాసులు వెలుగులోకి తీసుకురావడంతోనే రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందని, ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పించాలన్నారు. టీటీడీ మాజీ ఏవీఎస్ఓ సతీష్ కుమార్‌ని చంపిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పరకామణిలో పనిచేసే రవికుమార్ 35 సంవత్సరాలుగా కుంభకోణాలకు పాల్పడుతుంటే దీనికి కారణం టిటిడి అధికారులతో పాటు పాలకమండలి కూడా బాధ్యత వహించాలన్నారు. పరకామణి కేసులో అప్పటి టిటిడి మాజీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి ఈ విషయం తెలిసిన వారు అప్పట్లో రవికుమార్ పై చర్యలు తీసుకోకుండా లోక్ అదాలత్ ద్వారా రాజీచేసి కేవలం టిటిడికి అప్పట్లో 14 కోట్లు ఆస్తులు రాసి ఇచ్చారని గుర్తు చేశారు. ఇందులో పాలకమండలి చైర్మన్‌ల కూడా లబ్ది పొందినట్టు ఉన్నారని ఆరోపించారు. పరకామణి దొంగతనం జరుగుతుంటే టిటిడి పాలక మండలి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు

నాకు ప్రాణ హాని ఉంది.. రక్షణ కల్పించండి : జర్నలిస్ట్ మాచర్ల శ్రీనివాసులు

జర్నలిస్ట్ మాచర్ల శ్రీనివాసుల మాట్లాడుతూ టీటీడీ పరకామణిలో జరుగుతున్న కుంభకోణాలపై తన పత్రికలో వార్తలు వెలుగులోకి తీసుకురావడం జరిగిందని, తనపై కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడు తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులు గురి చేస్తే తను హైకోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. హైకోర్టు పరకామణి కేసు విచారణ ఆదేశించడం జరిగిందన్నారు. గతంలో శ్రీవాణి ట్రస్టు నిధుల్లో అవినీతి జరుగుతుందని తన పత్రికలో వార్తలు ప్రచురించడంతో అప్పటి టీటీడీ ఈ ఓ ధర్మారెడ్డి తనపై గంజాయి కేసు పెట్టి నెల్లూరులో 17 రోజులు పాటు జైల్లో ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుటుంబ సభ్యులందరూ ఆందోళన గురికాడమే కాకుండా తమకు రక్షణ లేకుండా పోయిందన్నారు. పరకామణి కేసులో అప్పటి టీటీడీ ఏవీఎస్ఓగా ఉన్న సతీష్ కుమార్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. సిఐడి విచారణకు వచ్చేందుకు స్వస్థలానికి వెళ్తుండగా రైల్లో అతని దారుణంగా హత్య చేశారన్నారు. తనకు, తన కుటుంబాన్ని కూడా ప్రాణహాని ఉందని రాష్ట్ర ప్రభుత్వం భద్రత కల్పించాలని కోరారు.

పరకామణి లోపాలు బయటపడ్డాయి : కందారపు మురళి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు

పరకామణి కుంభకోణం బయటపడటంతో అక్కడ లోపాలు ఉన్నాయని ప్రపంచవ్యాప్తంగా తెలిసిందన్నారు. శ్రీవారి నిధులను స్వాహా చేస్తూ ఉంటే టీటీడీ ఉన్నతాధికారులు పాలకమండలి ఏం చేస్తున్నారని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ప్రశ్నించారు. పరకామణిలో పనిచేసే రవికుమార్ 35 సంవత్సరాలుగా విదేశీ డబ్బులు దొంగతనం చేసి వాటిని వేరేచోట మార్పిడి చేసి ఆస్తులు సంపాదించుకున్నారని, దాని వెలుగులో తీసుకువచ్చిన జర్నలిస్టు శ్రీనివాసులుకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని రాష్ట్రప్రభుత్వం తక్షణమే భద్రత ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. టిటిడి మాజీ ఏవీఎస్ సతీష్ కుమార్‌ను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించి సమగ్రంగా విచారణ చేయాలని కోరారు. పరకామణి కేసు హైకోర్టు సిటింగ్ జడ్జితో తక్షణమే విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆలశ్యం చేయకూడదని కోరారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి

గత పాలకుల నిర్లక్ష్యమే : ఆర్.పి.ఐ పట్టణ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం

టీటీడీ పరకామణి విషయంలో పాలకుల నిర్లక్ష్యం వల్లే కుంభ కోణాలు జరిగాయి ఆర్.పి.ఐ పట్టణ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పరకమణి కేసులో రవికుమార్‌పై అప్పట్లో చర్యలు తీసుకుని ఉంటే బాగుండేదని, లోక్‌అదాలత్ ద్వారా రాజీ చేసి పాలకమండలి సభ్యులు లబ్ధి పొందారు తప్ప, టిటిడి ఖజానాకు మాత్రం నష్టం జరిగిందన్నారు. సతీష్ కుమార్ హత్యపై న్యాయ విచారణ జరిపించాలన్నారు. జర్నలిస్టు శ్రీనివాసులుకు, ఆయన కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు.

ప్రశ్నిస్తే చర్యలు : కృష్ణ, తిరుమల నివాసి

తిరుమలలో ఏదైనా అధికారుల అవినీతిని, ప్రశ్నిస్తే తమపై చర్యలు తీసుకోవడమే కాకుండా, బెదిరింపులు గురి చేస్తున్నారన్నారని తిరుమల నివాసి కృష్ణ ఆరోపించారు. తిరుమలలో ఉండే స్థానికులు పలు సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చిన, అవినీతికి సంబంధించిన ఫిర్యాదులు చేసిన అధికారులు ఇళ్లకు, షాపులకు వచ్చి బెదిరింపులు గురి చేస్తున్నారని ఆవేదన్య వ్యక్తం చేశారు. తిరుమలలో జరిగే అవినీతి ఇతర సమస్యలపై పత్రికా విలేకరులు వార్తలు రాస్తే వారిపై బెదిరింపులకు దిగుతున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. టిటిడి పరకామణి కేసు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, జర్నలిస్టు శ్రీనివాసులకు రక్షణ కల్పించాలని కోరారు.

ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు తీసుకోవడం లేదు : జర్నలిస్టు సుకుమార్ రాజు

పరకామణి కేసులో అవినీతిని వెలుగులోకి తీసుకొచ్చిన జర్నలిస్టు శ్రీనివాసులు తనకు ప్రాణహాని ఉందని తిరుపతి అర్బన్ ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు వెళ్తే పోలీసులు కేసులు తీసుకోవడం లేదని, ఈ విషయం సిఐడి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారు కూడా పట్టించుకోలేదని, శ్రీనివాసులు తనకు ప్రాణహానే ఉంది.. రక్షణ కల్పించాలని హైకోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. ఒక జర్నలిస్టుకు రక్షణ లేకుండా ఉంటే, సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

టీటీడీలో జరిగే అక్రమాలు అడ్డుకోవాలి : స్థానిక పోరాట హక్కుల కమిటీ అధ్యక్షుడు డీఎంసీ భాస్కర్

టీటీడీలో జరిగే అక్రమాలను స్థానికులు అడ్డుకోవాల్సిన అవసరం ఉందని స్థానిక పోరాట హక్కుల కమిటీ అధ్యక్షుడు డిఎంసి భాస్కర్ కోరారు. స్థానికులు ఎప్పుడు అక్రమాలు అడ్డుకుంటే.. అధికారులకు భయం ఉంటుందని, లేదంటే ఇలాంటి అక్రమాలు కొనసాగడమే కాకుండా టీటీడీకి చెడ్డ పేరు వస్తుందన్నారు. పరకామణి కేసులో హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించి సీనియర్ జర్నలిస్టు శ్రీనివాసులకు రక్షణ కల్పించాలని, మాజీ ఏవీఎస్ఓ సతీష్ కుమార్ హత్య విషయంలో న్యాయ విచారణ జరిపించి దోషులను శిక్షించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, జిల్లా నాయకులు జయచంద్ర, సాయి లక్ష్మి, ఆర్ లక్ష్మి, మాధవ్, నాయకులు జి.బాలసుబ్రమణ్యం, నరేంద్ర, సిపిఎం నగర కార్యదర్శి పి వేణుగోపాల్, బుజ్జమ్మ జయంతి పాల్గొన్నారు.

ఫిబ్రవరి నెల దర్శన కోటా విడుదల

ప్రజాశక్తి - తిరుమల: 2026 ఫిబ్రవరి నెలకు సంబంధించి టీటీడీ విడుదల చేసే దర్శనాల, గదుల కోటా వివరాలు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది.తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల (సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ) కు సంబంధించిన ఫిబ్రవరి నెల కోటాను నవంబర్ 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్లు డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు 20 నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి టికెట్లు మంజూరవుతాయి. 21న ఆర్జిత సేవా టికెట్ల విడుదల. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవం టికెట్లను 21న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్ లైన్ లో విడుదల చేయనుంది. 21న వర్చువల్ సేవల కోటా విడుదల, వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్ల కోటాను 21న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

సాక్షులకు రక్షణ కల్పించాలి : టీడీపీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీవారి పరకామణి చోరీ కేసులో సాక్షులకు రక్షణ కల్పించాలని టిడిపి బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం ఉమేష్ రావు ప్రభుత్వానికి ఆదివారం విజ్ఞప్తి చేశారు. పరకామణి కేసులో కీలక సాక్షిగా ఉన్న విజిలెన్స్ విభాగం ఎస్సై సతీష్ కుమార్ హత్య గురికావడం ఇందుకు బలాన్ని చేకూరుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. హత్యల వెనుక ఎవరున్నారో శ్రీవారికే ఎరుకనీ, ఆయనే సాక్షులను కాపాడుకోవాలని అన్నారు. సాక్షుల తో పాటు ఫిర్యాదుదారులు కూడా ప్రభుత్వం రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పలువురు బీసీ విభాగం నేతలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఐజర్‌లో

శాస్త్రీయ, ప్రజోపయోగ ఉపన్యాసాలు

- ముగిసిన 91వ వార్షిక సమావేశం
- పాల్గొన్న శాస్త్రజ్ఞులు, పెల్లోలు, పరిశోధకులు

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం, జంగాలపల్లి సమీపంలో ఉన్న ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ రీసెర్చ్(ఐజర్)లో 91వ భారతీయ విజ్ఞాన వార్షిక సమావేశం ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రొ. రాఘవన్ వరదరాజన్ అధ్యక్షతన మూడు రోజులపాటు నిర్వహించడం జరిగింది. ఈ వార్షిక సమావేశంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ శాస్త్రజ్ఞులు, పెల్లోలు, పరిశోధకులు వివిధ శాస్త్రాయ రంగాలలోని వైరల్ వ్యాక్సిన్‌ల స్థిరత్వం, ప్రభావం, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(కృత్రిమ మేధస్సు), మానవ ఇంజనీరింగ్ మేధస్సు, అణు భౌతిక శాస్త్రం, మెటీరియల్ సైన్స్, భూగర్భ శాస్త్ర సౌకర్యాల వద్ద పరిశోధన అవకాశాలు వంటి అంశాలపై శాస్త్రీయ చర్చలు, ప్రజోపయోగ ఉపన్యాసాలపై చర్చించడం జరిగింది. పాఠశాలల విద్యార్థుల కోసం విజ్ఞాన కథలో అనే సైన్స్ ఔట్రిచ్ అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. అలాగే భారతీయ మహిళా శాస్త్రవేత్తల విజయాలను తెలిపే లీలావతి డాటర్స్ అనే పుస్తకానికి కన్నడ, ఒడియా వెర్షన్ లను విడుదల చేశారు. వైజాగ్ తిరుపతి రిజిస్ట్రార్ ఇంద్ర ప్రీతిసింగ్ కోహ్లీ మాట్లాడుతూ, ఐజర్ విజ్ఞాన కేంద్రం వివిధ రంగాలలో శాస్త్రీయ పరిశోధనలో, విద్యా రంగంలో ముందడుగులు వేసేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

అమ్మవారి ఆలయంలో

వైభవంగా లక్ష కుంకుమార్చన



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం లక్ష కుంకుమార్చన సేవ వైభవంగా నిర్వహించారు. హిందూ సనాతన ధర్మంలో కుంకుమకు ఎనలేని ప్రాధాన్యత ఉంది. వివాహితురాలైన మహిళ నుదుట కుంకుమ ధరించడం వల్ల భర్త దీర్ఘాయుష్షు పొందుతాడని హిందూ ధర్మం చెబుతోంది. లక్ష్మీ, సరస్వతి, పార్వతి అమ్మవార్ల పేర్లతో పిలుస్తున్న శక్తి అమ్మవారికి ప్రతిరూపంగా సింధూరం లేదా కుంకుమకు ప్రాశస్త్యం ఉంది. అమ్మవారి ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు లాంటి భారీ ఉత్సవాలను నిర్వహించే ముందు అర్చకులు లక్ష కుంకుమార్చన నిర్వహించడం సంప్రదాయం. ఈ విశిష్టమైన సేవ ద్వారా అమ్మవారు ప్రసన్నమై ఉత్సవాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా జరిగేలా ఆశీర్వదిస్తారని అర్చకులు తెలిపారు. ఆలయంలోని శ్రీకృష్ణ ముఖ మండపంలో శ్రీ పద్మావతి అమ్మవారిని ఆశీనులను చేసి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అర్చకులు శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు లక్ష్మీ అష్టోత్తరం, లక్ష్మీ సహస్రనామాలను వల్లిస్తూ అమ్మవారిని కుంకుమతో అర్చన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, పాంచరాత్ర ఆగమసలహాదారు మణికంఠ భట్టర్, అర్చకులు బాబుస్వామి, పలువురు అర్చకులు, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజలు ఆరాధించే హిందూ దేవతల ఆలయాలు నిర్మించుకోవచ్చు

శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 500 ఆలయాల నిర్మాణానికి టీటీడీ ఆమోదం : ప్రజాశక్తి ముఖాముఖిలో జిల్లా దేవాదాయ శాఖ అధికారి రామక్రిష్ణారెడ్డి

ముఖా ముఖి

ప్రజాశక్తి - తిరుపతి(మంగళం): జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా పరిధిలో శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఆలయాలను నిర్మిస్తున్నామని జిల్లా దేవాదాయ శాఖ అధికారి రామక్రిష్ణా రెడ్డి తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో ఎస్సీ, ఎస్టి, బీసీ, ఫిషర్ మెన్స్ కాలనీలలో నూతనంగా ఆలయాల నిర్మించడానికి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నిధులు సమకూర్చడానికి ఆమోదం లభించిందని తెలిపారు. ధర్మ పరిరక్షణలో భాగంగా ధర్మ ప్రచార కార్యక్రమాలతో పాటు ఇటువంటి కార్యక్రమాలను తమ శాఖ చేస్తుందని తెలిపారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా పరిధిలో ఆ శాఖ అమలు చేస్తున్న అన్నింటి వివరాలను జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి పి.రామక్రిష్ణారెడ్డి ప్రజాశక్తి నిర్వహించిన ముఖాముఖిలో పలు విషయాలను తెలిపారు.

ప్రజాశక్తి: దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లాలో ఉన్న ఆలయాలతో పాటుగా ధూప దీప నైవేద్యాలకు శాఖ నుండి ఎటువంటి చేయూత ఇస్తున్నారు?

అధికారి: దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ధూప దీప నైవేద్యాలకు సంబంధించి 109 ఆలయాలకు నెలకు పదివేల రూపాయల చొప్పున ఇస్తున్నాం. అలానే అర్చకులకు ఉపాధి లేకపోతే గుర్తింపు పొందిన విద్యాసంస్థల నుండి పట్టభద్రుడై ఉంటే నిరుద్యోగ భృతి కింద నెలకు రూ. 3 వేలు మంజూరు చేస్తున్నాం. దేవాలయాలలో అర్చకుల పిల్లల చదువులకు సంబంధించి కూడా కొన్ని స్కీములను అమలు చేస్తున్నాం.

ప్రజాశక్తి: దేవాలయాలలో పనిచేసే అర్చకులకు ఎటువంటి సౌలభ్య స్కీములు అమలు చేస్తున్నారు?

అధికారి: అర్చకుల పిల్లలకు సంబంధించి వారి ఉన్నత విద్యల కోసం ఫీజులను బట్టి లోన్ రూపంలో సహాయం చేస్తున్నాం. విదేశీ విద్య అయితే దాని ఫీజును బట్టి, స్వదేశమైతే దాని ఫీజును బట్టి లోన్ ఇవ్వడం జరుగుతుంది. ఇవే కాకుండా అర్చకుల పిల్లలకు చదువుకునేందుకు అడ్వాన్సులు ఇస్తున్నాం. దేవాలయ ప్రాంగణాలలో ఎవరైతే అర్చకులు సొంత ఇంటి స్థలం లేని వారికి ఆ గృహ నిర్మాణాలకు రెండు సెంట్లు స్థలం కేటాయింపు చేసే విధంగా స్కీమును అమలు చేస్తున్నాం. అర్చకులకు ఇచ్చే ఈ స్కీము ఆయా దేవాలయాల ప్రాంగణంలో స్థలం ఉంటేనే అమలు చేయడానికి వీలు అవుతుంది.

ప్రజాశక్తి: శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఆలయాల నిర్మాణం వివరాలను తెలపండి?

అధికారి: తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలో ఉన్న శ్రీవాణి ట్రస్ట్ ద్వారా దేశవ్యాప్తంగా ఆలయాల నిర్మాణం చేయడానికి వారు సంకల్పించారు. ఇందుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ టీటీడీ సౌజన్యంతో అమలు చేయడానికి ప్రణాళికలు తయారుచేసి తగిన అనుమతులు మంజూరు చేయడం జరుగుతోంది. ఇప్పటివరకు తిరుపతి జిల్లా పరిధిలో 185 దేవాలయాలు నిర్మాణంలో ఉన్నాయి. మరో 500 ఆలయాలు నిర్మాణం చేయడానికి ఇటీవల టీటీడీ బోర్డులో ఆమోదం కూడా చేశారు. హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ ఫిషర్ మెన్ కాలనీలలో వారు ఆరాధించే దేవతామూర్తుల ఆలయాలను నిర్మించుకోవచ్చు. ఈ ఆలయాల నిర్మాణానికి సంబంధించి ఆయా కాలనీలకు సంబంధించిన వారు తగిన అనుమతులు పొంది వారికి ఇష్టమైన హిందూ దేవత మృతుల ఆలయాలను నిర్మించుకోవచ్చు.

ప్రజాశక్తి: దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇచ్చే సహకారంతో ఆలయాల నిర్మాణం పూర్తయిన తర్వాత ఆలయాల నిర్వహణకు సంబంధించిన పరికరాలను ఏవైనా అందిస్తున్నారా?

అధికారి: ఎవరైతే దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా ఆలయాల నిర్మాణాలకు దరఖాస్తు చేసుకొని పూర్తి చేసుకుంటారో వారికి రాయితీ ద్వారా రాతి, పంచలోహ విగ్రహాలు, మైక్ సెట్‌లు అందించబడతాయి. శేష వస్త్రాలు ఉచితంగా అందిసాము. రూ.25 విలువగల మైక్ సెట్‌లను రాయితీ స్కీము ద్వారా ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం సబ్సిడీతో అందిస్తున్నాం. అదేవిధంగా గొడుగులు 50 శాతం సబ్సిడీతో అందిస్తున్నాం.

ప్రజాశక్తి: పురాతన ఆలయాలకు సంబంధించి పునర్నిర్మాణానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా ఎటువంటి సహాయం చేస్తారు?

అధికారి: దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా పురాతన ఆలయాలను తిరిగి నిర్మించుకోవడానికి దేవాదాయ శాఖ తగిన సహకారాన్ని అందిస్తుంది. ఎవరైతే నిర్మాణం చేయాలని ముందుకు వస్తారో.. తగిన అనుమతులు, నిర్మాణ వ్యయంకు సంబంధించిన ప్రక్రియ పూర్తి అయితే 80 శాతం దేవాదాయ ధర్మాదాయ శాఖ, 20 శాతం ప్రజలు ఖర్చు చేసే విధంగా సహకారం ఇస్తున్నాం.



ప్రజాశక్తి: ఆలయాల ఆదాయం నుండి దేవాదాయ ధర్మాదాయ శాఖ సిజిఎఫ్ ఏ మేరకు పొందుతున్నారు?

అధికారి: తిరుపతి జిల్లాలో అత్యధిక ఆదాయం వచ్చే ఆలయాలు ఉన్నాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న శ్రీకాళహస్తి ఆలయం వార్షిక ఆదాయం రూ.200 కోట్లుగా ఉంది. ధర్మ పరిరక్షణ కోసం సాధారణంగా మంచి ఆదాయం వచ్చే ఆలయాల నుండి 9 శాతం కామన్ గుడ్ ఫండ్ (సిజిఎఫ్) దేవాదాయ ధర్మాదాయ శాఖకు ఇవ్వాల్సి ఉంటుంది. టిటిడి నుండి కూడా దేవాదాయ శాఖకు సిజిఎఫ్ నిధులు కేటాయిస్తారు.

కామ్రేడ్ కాలేషా స్మృతి తీరని లోటు

నివాళి అర్పిస్తున్న సిపిఐ, సిపిఐయం నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కామ్రేడ్ కాలేషా స్మృతి ఉద్యమానికి లోటని సిపిఐ తిరుపతి జిల్లా కార్యదర్శి పి.మురళి పేర్కొన్నారు. ఆదివారం గూడూరు రెండో పట్టణంలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో కామ్రేడ్ కాలేషా సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ అధ్యక్షత వహించారు. కామ్రేడ్ కాలేషా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథి పి.మురళి మాట్లాడుతూ కామ్రేడ్ కాలేషా పోరాట ఫలితంగానే.. ఈ రోజు ప్రభుత్వం స్పందించి గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపనున్నారని తెలిపారు. సీపీఐ గూడూరు కార్యాలయానికి కామ్రేడ్ కాలేషా భవనంగా పేరు మారుస్తామని తెలిపారు. సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ మాట్లాడుతూ కామ్రేడ్ కాలేషా పేద ప్రజలకోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఆయన మన మధ్య లేక పోవడం బాధాకరం అన్నారు. ఆయన కుటుంబసభ్యులు మస్తాన్, భాను, భాషా పీర్ లకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కేంద్ర సి.ఈ.సి సభ్యులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, సీపీఎం నాయకులు ఎంబేటి చంద్రయ్య, కె.వి.పి.ఎస్ నాయకులు అడపాల ప్రసాద్, నారా గోపాల్, గోను శివకుమార్, ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ యునైటెడ్ ఫోరమ్ జాతీయ ఉపాధ్యక్షులు వేగూరు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల స్థితి..గతులు పరిశీలించండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఇటీవల వర్షానికి చెరువులు నిండి పోయిన నేపథ్యంలో, వాటి పరిస్థితులను పరిశీలించాలని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పుత్తూరు డివిజన్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన ఆదివారం పుత్తూరు, వడమాలపేట మండలాల్లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిండిన చెరువుల్లో నీరు లీకేజీ సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సప్లై ఛానెల్స్ మరమ్మత్తులు ఉంటే తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్‌బిఆర్ పురం చెరువుకు సంబంధించిన నీరు ఎక్కువ సామర్థ్యంలో నిల్వ ఉండటం, గ్రామం ముంపుకు గురి అవుతుండడంపై తగిన పరిష్కార మార్గాలు కనుగొనాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా, గ్రామం ముంపుకు గురి కాకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర ప్రసాద్, పుత్తూరు డివిజన్ డిఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనలో సిద్ధార్థ ముందంజ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్ర యువతకు మంచి ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో సిద్ధార్థ సంస్థ ముందుండి పనిచేస్తుందని కళాశాల చైర్మన్ డాక్టర్ అశోక్ రాజు పేర్కొన్నారు. పుత్తూరు సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో, 13 నుండి 16వ తేదీ వరకు క్యాంపస్ డ్రైవ్ విజయవంతంగా నిర్వహించారు. చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన బి.టెక్ ఫైనల్ ఇయర్ అమ్మాయిల కోసం మాత్రమే ఈ భారీ నియామక డ్రైవ్ ఏర్పాటుచేశారు. మొత్తం 43 ఇంజనీరింగ్ కాలేజీల నుండి 5,899 మంది అర్హులైన విద్యార్థులు నమోదు చేసుకోగా, అందులో 5,220 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 782 మంది విద్యార్థులు ఇంటర్వ్యూకు ఎన్నికయ్యారు. తుది ఫలితాలను ఇన్ఫోసిస్ త్వరలో ప్రకటించనుంది.

చెన్నూరులో హ్యాపీ డైలీ ఔట్ లెట్ ప్రారంభం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని చెన్నూరు, తూర్పు వీధిలో హ్యాపీ డైలీ ఔట్ లెట్‌ను ఐందుకూరు లక్ష్మీ రెడ్డి చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి మాట్లాడుతూ చెన్నూరులో పాల ఉత్పత్తులకు సంబంధించిన హ్యాపీ డైలీ ఔట్ లెట్ ప్రారంభం కావడం శుభపరిణామన్నారు. పాలు, పెరుగు, ఐస్ క్రీమ్, నెయ్యి పలు రకాలు హోల్ సేల్ ధరలో దొరుకుతాయని, ప్రతి ఒక్కరు ఆదరించి వ్యాపారాభివృద్ధికి సహకరించాలని తెలిపారు. అనంతరం ఔట్ లెట్ యజమానులు పువ్వులపల్లి దీపక్ రెడ్డి, మానసలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మట్టం మురళి, ఐందుకూరు భవనమ్మ, అల్లం కృష్ణయ్య, శ్యామల, అంకమ్మ, ఐందుకూరు లక్ష్మి రెడ్డి, ముప్పాల గిరిధర్ రెడ్డి, సురేంద్ర రెడ్డి, కటికాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బహుజన సమాజ్ పార్టీ పత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరిలోని పాత పల్లెకు బహుజన సమాజ్ పార్టీ కార్యక్రమం పత్రికలను ఆదివారం టవర్ క్లాక్ వద్ద ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ బహుజనులకు అధికారం సాధించడమే బీఎస్పీ లక్ష్యమని, భారతరాజ్యాంగాన్ని మేనిఫెస్టోగా తీసుకున్న ఏకైక రాజకీయ పార్టీ బీఎస్పీనే అన్నారు. ఓటరు ఎప్పుడు యజమానిలాగా ఉండాలని, నాయకుడు సేవకుడిగా ఉండాలని భావించే పార్టీ బీఎస్పీ అన్నారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఏపీఐఏపీఐ రాష్ట్ర అధ్యక్షుడు చింతమాకుల పుల్లమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి పూలిముట్ల బాబు, అసెంబ్లీ ఇన్చార్జ్ రవి, అసెంబ్లీ అధ్యక్షుడు నాగరాజు, పార్టీ సలహాదారుడు దేవ్ తదితరులు పాల్గొన్నారు.

రాజమ్మకు డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యా విభాగం పరిశోధన విద్యార్థిని ఎం రాజమ్మకు డాక్టరేట్ ప్రధానం చేసినట్లు వర్సిటీ ఎగ్జామినేషన్ డీన్ ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయం విద్యావిభాగం ఆచార్యులు డాక్టర్ వి.మాధవి మార్గదర్శకత్వంలో "అకాడమిక్ అచీవ్మెంట్ ఇన్ రిలేషన్ టు మెంటల్ హెల్త్ అకాడమిక్ స్ట్రెస్ అండ్ స్కూల్ ఎన్విరాన్మెంట్ అమాంగ్ హై స్కూల్ స్టూడెంట్స్" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎం. రాజమ్మకు డాక్టరేట్ లభించడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

కవి సమ్మేళనం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్(తొట్టంబేడు): స్థానిక తొట్టంబేడు గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కవులు కవి సమ్మేళనంలో పాల్గొని గ్రంథాలయాల ఆవశ్యకతపై మాట్లాడారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ప్రముఖ కవి కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా హాజరై కవి సమ్మేళనంలో అలరించారు. గ్రంథాలయాధికారి హరికృష్ణ పాల్గొన్నారు.

పరిశ్రమలపై పర్యవేక్షణ కరువు..!

- యాజమాన్యాలకు అధికారుల దన్ను
- సేఫ్టీ శూన్యమైనా అనుమతులు
- కార్మికులకు రక్షణేదీ..?
- కార్మిక, అగ్నిమాపక శాఖ అధికారుల ఉదాశీన వైఖరి

ప్రజాశక్తి - నాయుడుపేట: రాష్ట్రాభివృద్ధికి పరిశ్రమల స్థాపనే సరైన మార్గమని, ప్రభుత్వాలు పరిశ్రమలను తీసుకు వస్తుంటే కొందరు అధికారుల నిర్లక్ష్య ధోరణి ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడిచే విధంగా ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాయుడుపేట మండలం, మేనకూరు సెజ్ పరిధిలో వందల సంఖ్యలో పరిశ్రమలు నడపబడుతున్నాయి. ఈ పరిశ్రమలు చట్టబద్ధంగా నడుస్తున్నాయా లేదా..? కార్మికులకు మౌలిక వసతులు, రక్షణ ఏమేరకు కల్పిస్తున్నారనే విషయాలు పర్యవేక్షించాల్సిన అధికారుల నిర్లక్ష్యం పరిశ్రమల యాజమాన్యాలకు ఆదాయం తెచ్చిపెడుతోంది, కానీ కార్మికుల ప్రాణాలను హరించి వేస్తోంది. అధికారులు పరిశ్రమ యాజమానుల దయాదాక్షిణ్యాల కోసం పరితపిస్తూ నిత్యం వారి ఆధీనంలో ఉంటూ, కార్మికుల జీవితాలను ప్రమాదాలకు వదిలేసారనే ఆరోపణలున్నాయి. ఇటీవల పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలేకాక, మితిమీరిన వేగంతో నిర్లక్ష్యంగా నడుస్తున్న పరిశ్రమల వాహనాలు అటు కార్మికుల, ఇటు ప్రజల ప్రాణాలను బలిగొన్న సంఘటనలు చోటుచేసుకున్నాయి. పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్న ఏ ఒక్క అధికారి కూడా ఆ పరిసర ప్రాంతాల్లో కనిపించకపోవడం గమనార్హం. ఈ మధ్యకాలంలో ఫార్మాస్యూటికల్ కంపెనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఎంతమంది ప్రాణాలు కోల్పోయారు, ఎంతమందికి గాయాలయ్యాయి అన్న ప్రశ్నకి సరైన సమాధానాలు లేవు, బ్రేక్స్ ఇండియా కంపెనీలో జరిగిన వ్యక్తి మరణం, అలాగే రెండు రోజుల క్రితం బ్రేక్స్ ఇండియా కంపెనీ వాహనం అతివేగం కారణంగా జరిగిన ప్రమాదంలో బలైపోయిన ఒక యువకుడు, రోడ్డున పడ్డ అతని కుటుంబం ఇలా చెప్పుకొస్తే ఘటనలు అనేకం. పేరుకు మాత్రం నాయుడుపేట వందలాది కంపెనీలకు ప్రధాన పట్టణం, కానీ ఇక్కడ అందుకు సంబంధించిన పర్యవేక్షణ అధికారి ఏ ఒక్కరూ కనిపించరు.

నాయుడుపేట పట్టణం, పరిసర గ్రామాల ప్రజలు ఈ కంపెనీల కారణంగా ఎదుర్కొన్న సమస్యల గురించి చెప్పుకోవాలంటే అధికారులు ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి. కార్మికుల సంరక్షణ బాధ్యతగా చూడాల్సిన లేబర్ డిపార్ట్మెంట్ పేరుకైతే నాయుడుపేటలో కార్యాలయం ఉందన్న మాటే గాని, అధికారులు మాత్రం కనిపించరు. అదేమని ప్రశ్నిస్తే ఎక్కడో పనిచేస్తున్న అధికారిని ఇక్కడ ఇన్చార్జిగా నియమించారని, ఆయన అక్కడ పనిచేస్తూ అప్పుడప్పుడు మాత్రమే ఇక్కడికి వస్తుంటారని సమాధానం వినిపిస్తుంది. కానీ ఆయన ఎప్పుడు వస్తారన్న ప్రశ్నకు మాత్రం సమాధానం కనిపించదు. ఆయన పై అధికారి ఏ సి ఎల్ (అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డిపార్ట్మెంట్)కు కార్మికుల సమస్యలతో ఎటువంటి సంబంధాలు ఉండవు కానీ కంపెనీ యాజమాన్యులతో, పట్టణంలో వారి డిపార్ట్మెంట్ పరిధిలోకి వచ్చే ప్రతి ఒక్క వ్యాపారస్తులతో సంబంధాలు పుష్కలంగా కలిగి ఉన్నాడని తెలుస్తోంది. పరిశ్రమల, కార్మికుల రక్షణ బాధ్యతలు చూడాల్సి మరొక ప్రధాన శాఖ అగ్నిమాపక శాఖ, కంపెనీలలో జరుగుతున్న అగ్ని ప్రమాదాలపై వీరు చెబుతున్న సమాధానాలు హాస్యాస్పదంగా ఉంటాయి. నలుగురు ఐదుగురు పనిచేసే చిన్న చిన్న షాపుల దగ్గర నుంచి పెద్ద పరిశ్రమల వరకు వీరి అనుమతులు తప్పనిసరి. సూపర్ మార్కెట్ అయినా, హాస్పిటల్ అయినా, పరిశ్రమలైన వీరు నిర్మాణ దశలో క్షుణ్ణంగా పరిశీలించి అనుమతులు ఇవ్వాల్సిఉంది. కానీ చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు అగ్నిమాపక అధికారులపై ఉన్నాయి. గ్రామాల మధ్య ఏదైనా పరిశ్రమ ప్రారంభించేటప్పుడు పై స్థాయి అధికారులు ఆ గ్రామాలకు సంబంధించిన ప్రజలకు ఆ పరిశ్రమ గురించి పూర్తి వివరాలు తెలియజేసి, ప్రజాభిప్రాయ సేకరణ జరపి ఆయా గ్రామాల ప్రజల ఆమోదంతో ఎలాంటి పరిశ్రమకైనా అనుమతులు ఇవ్వవలసి ఉంది, కానీ ప్రజాభిప్రాయ సేకరణ అనేది చట్టబద్ధంగా జరగడం లేదని నిర్వివాదాశం. ఇలా ప్రజాభిప్రాయ సేకరణ జరిగినప్పుడు మీడియాకు సమాచారం లేకపోవడం ఆ వాదనలకు బలాన్ని చేకూరుస్తోంది. జరుగుతున్న ప్రమాదాలపై, పరిశ్రమల యాజమానులు నిర్లక్ష్య ధోరణిపై, జరిగిన ప్రజాభిప్రాయ సేకరణపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించాలన్న, వివరాలు తెలుసుకోవాలన్న ఏ ఒక్క అధికారి అందుబాటులో ఉండకపోవడం, అధికారులు వీటిపై ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. పై అధికారులు, నాయకులు వీటిపై వెంటనే స్పందించి పరిశీలించి జరుగుతున్న ప్రమాదాలతో కార్మికులు, ప్రజలు పడుతున్న ఇబ్బందిని దూరం చేస్తారని ఆశిద్దాం.

ఎన్ఎన్ ధనపాల్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి.- పుత్తూరు టౌన్ : నూతనంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొదలియార్ డెవలప్మెంట్ అండ్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్ ఎన్ ధనపాల్‌గా నగరి నియోజకవర్గ శాసనసభ్యులు గాలి భాను ప్రకాష్ చొరవతో నియమించడం జరిగింది. అందుకు పదో వార్డ్ ఇన్చార్జి, రాష్ట్ర తెలుగు యువత మిడియా కోఆర్డినేటర్. డిజీ ధనపాల్, టిడిపి నాయకులు, కార్యకర్తలు కలసి, ఎన్ఎన్ ధనపాల్‌ను గజమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమములో, నగరి నియోజకవర్గం బీసీ సెల్ కార్యదర్శి డి.శ్రీనివాసులు, 10 వ వార్డ్ అధ్యక్షుడు బి.రూపేంద్ర, 58 వ బూత్ కన్వీనర్ ఎస్.సాయి కుమార్, 57 వ బూత్ కో కన్వీనర్ డి.హరి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సదాశివం మొదలియార్, చైతన్య, గోవిందుడు, కళ్యాణ్, అంకయ్య, మురుగన్, వెంకటేష్, నాగరాజు, ఆరుముగం, ధన, మురుగేష్, శరవణ, శీను, కళ్యాణ్, శివ, కుమార్, బాబ్జి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో సెంట్రల్ లైటింగ్ ప్రారంభం

ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, తుడ చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గూడూరు మున్సిపాలిటీలో తొమ్మిది కోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి పనులు చేయడం జరిగిందని, రాబోయే రోజుల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పూర్తి చేస్తామని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ దివాకర్ రెడ్డి వెల్లడించారు. గూడూరు పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ ప్రారంభ కార్యక్రమానికి తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి హాజరయ్యారు. సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించి, అనంతరం గూడూరు చెరువు కట్టను పరిశీలించారు. వాకింగ్ ట్రాక్‌కోసం నిధులు మంజూరు చేయాలని తుడా చైర్మన్‌ని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ త్వరలో అర్బన్ హెల్త్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ తుడా పరిధిలోని అన్ని మున్సిపాలిటీల ప్రజలకు అవసరమైన తాగునీరు, లైటింగ్ వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్ కుమార్ పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, బిల్లు చెంచురామయ్య, రహీం, మస్తాన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని తిరిగి పునరుద్దించాలని బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్, జిల్లా కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. పుత్తూరు డివిజన్ జనరల్ బాడీ సమావేశం స్థానిక అంబేద్కర్ భవన్‌లో శరవణ మేస్త్రి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎస్ చంద్రశేఖర్ రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీరాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని, పెండింగ్ క్లైములు అలాగే ఉన్నాయని వీటి సాధన కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ పోరాటాలకు సిద్ధమవుతుందని, అందులో భాగంగా ఈనెల 30న కడపలో ప్రాంతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం జిల్లా ఆఫీస్ బేరర్స్ ఎస్ చంద్రబాబు, శెట్టిపల్లి రవి, సిపిఐ పుత్తూరు కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎఫ్టీయూ(న్యూ) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : గుంటూరు వేదికగా డిసెంబర్ 8, 9వ తేదీల్లో జరిగే అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య(న్యూ) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర నాయకులు ఎస్ మీరయ్య పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఆదివారం ఏఐఎఫ్టీయూ(న్యూ) జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను నీరుగారుస్తున్న విధానాన్ని మీరయ్య ఎండగట్టారు. నాలుగు లేబర్ కోడ్ల రద్దుకై కార్మికులంతా తిరగబడాలని పిలుపునిచ్చారు. మహాసభల వేదికగా కార్మికుల సమస్యల పరిష్కారంపై సమర శంఖం పూరించాలని కోరారు. నాయకులు వీసీ వెంకటయ్య, కోగిల ధర్మయ్య, భాస్కరయ్య, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని శ్రీకాళహస్తి డిఎస్పి నరసింహమూర్తి కొనియాడారు. ఆ సంస్థ దివ్యాంగులకు అందజేస్తున్న 167 వ నెల నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమానికి ఆదివారం డిఎస్పి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంస్థ సేవా కార్యక్రమాలపై చిత్రీకరించిన ఓ పాటను సభ్యులతో కలిసి డీఎస్పీ వీక్షించారు. నిర్వాహకుడు మునీర్ బాషాను అభినందించారు. సభ్యులు గరికపాటి రమేష్ బాబు, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు శాప్ చైర్మన్ అభినందన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: రానున్న 68వ జాతీయ షూటింగ్ ఛాంపియన్షిప్‌కు ఎంపికైన తిరుపతి చెందిన క్రీడాకారులు హితేష్, దేవిశ్రీ ప్రసాద్‌లు శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఇరువురు ఆటగాళ్ల షూటర్ హితేష్, రోలర్ స్కేటింగ్ క్రీడాకారులు దేవిశ్రీ ప్రసాద్‌లు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తారని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గర్వకారణం అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌డిఓ శశిధర్ పాల్గొన్నారు.

మా భూమికి రికార్డులు ఉన్నాయి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): ప్రభుత్వానికి డబ్బులు చెల్లించి మూడు సెంట్లు స్థలాన్ని పొందామని, దానిలో నిర్మాణాలు చేసుకుంటుంటే అడ్డు తగలడం సరికాదని, స్థలానికి సంబంధించిన అన్ని రికార్డులు తమ వద్ద ఉన్నాయని సదరు భూ యజమాని జ్యోతిశ్వరి తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మా కోడలు కుందన సింధు అమ్మ సిహెచ్ వి నాగరత్నం, భాస్కర్ నాయుడు 1986లో అప్పటి ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన రుసుములు చెల్లించి చెరో మూడు సెంట్ల స్థలాన్ని ఎంఆర్ పల్లి స్మశాన వాటిక వద్ద పొందడం జరిగిందన్నారు. అయితే గడిచిన మూడు నెలల కాలంలో కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ ఇందులో కలగజేసుకొని రాద్ధాంతం చేశారన్నారు. ఎవరికైనా ఈ స్థలం కు సంబంధించి ఎటువంటి అభ్యంతరాలు ఉన్న కోర్టులో పరిష్కరించుకోవాలని కోరారు.

ఘనంగా ప్రపంచ ప్రీ మెచ్యూర్డ్ బేబీస్ దినోత్సవం

కార్యక్రమంలో అంకుర ఆసుపత్రి సిబ్బంది

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి అంకుర చిల్డ్రన్స్ అండ్ ఉమెన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ ప్రీ మెచ్యూర్డ్ బేబీస్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ మెచ్యూర్డ్ బేబీస్‌కు మద్దతుగా 5కే రన్ నిర్వహించారు. తిరుపతి బస్టాండ్ సమీపంలోని నేషనల్ ఫ్లాగ్ నుంచి ప్రారంభమైన ఈ 5కే రన్‌ను అంకుర హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ జగదీష్, డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ పార్థలు జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుంచి గోదాదేవి మార్గానికి చేరుకొని అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ రన్ కాటన్ మిల్ మెయిన్ రోడ్డు మీదుగా అంకుర హాస్పిటల్ వరకు సాగింది. ఈ సందర్భంగా డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ 37 వారాలు గర్భధారణ పూర్తయ్యే ముందు పుట్టిన శిశువులను ప్రీమెచ్యూర్ బేబీలు అంటారని, పుట్టిన తరువాత వీరు అనేక సవాళ్లను ఎదుర్కొంటారన్నారు. ఈ బేబీస్ ఆసుపత్రిలో ఉండాల్సి రావచ్చుని, వెంటిలేటర్ సహాయం అవసరం కావచ్చుని తెలిపారు. అంకురా హాస్పిటల్ తిరుపతిలో 24 వారాల గర్భధారణ వయస్సు(6 నెలలు) నుంచీ, 600 గ్రాములు తక్కువ బరువుతో పుట్టిన ప్రీమెచ్యూర్ బేబీలకు విజయవంతంగా చికిత్స చేశామన్నారు. నైపుణ్యం కలిగిన వైద్యులు ఉండడం వలన మా యూనిట్‌లో ప్రీమెచ్యూర్ శిశువుల జీవన రేటు 99 శాతంగా ఉందని చెప్పడానికి గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంకుర హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణ కళాశాలలో క్రీడల్లో సింధు భవన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, శ్రీనివాస మంగాపురం రైల్వే గేట్ సమీపంలోని నారాయణ కళాశాల కేంద్రమైన సింధు భవన్‌లోని ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం చదువుతున్న బాలికలు ఏడు రకాల క్రీడల పోటీలలో తమ అత్యుత్తమ ప్రతిభను చాటారు. నిరంతరం విద్యార్థులు జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్, నీట్, ఎంసెట్ వంటి జాతీయ, రాష్ట్రస్థాయి పోటీ పరీక్షల్లో నిరంతరం తలమునకలై ఒత్తిడి గురవుతున్న అమ్మాయిలకు ఆటవిడుపుగా ఏడు రకాల క్రీడా పోటీలను నిర్వహించారు. క్యాంపస్‌లో ఆడిన 7 ఆటల పోటీలలో సింధు భవనంలోని కళాశాల అమ్మాయిలు 5 ప్రధాన విజయాలు సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ సాధనకు చాలా తక్కువ సమయం ఉన్నప్పటికీ, వీరు బలాన్ని, దృఢ సంకల్పాన్ని నిరూపించుకున్నారు. 12-14 శాఖలతో పోటీ పడి, మీరు ధైర్యంగా నిలిచారు. 12 శాఖలు పాల్గొన్న కబడ్డీ పోటీలలో రన్నర్లు గా నిలిచారు. 13శాఖలు పాల్గొన్న ఖోఖో పోటీలలో రన్నర్స్, 14 శాఖలు పాల్గొన్న త్రోబాల్ పోటీలలో రన్నర్లుగా నిలిచారు. 12 శాఖలు పాల్గొన్న టెన్నికాయిట్ ఆటలలో రన్నర్స్‌గా, 14 శాఖలు పాల్గొన్న పరుగు పందెంలో 2వ స్థానం సాధించారు. తక్కువ సాధన ఎక్కువ అంకితభావం... అందుకే మీరు గెలిచారని ఆమె పేర్కొన్నారు. మా బ్రాంచ్‌ని ప్రకాశింపజేసినందుకు మీ అమ్మాయిలు చాలా గర్వంగా ఉందన్నారు. బాలురు, బాలికలు కలిపి 18 శాఖలలో మరో గర్వకారణమైన క్షణం, సింధు భవన్ అత్యధిక కప్పులను గెలుచుకుందన్నారు. క్రీడాకారులలో చిరపు కీర్తి ప్రియ, భవ్య, జాహ్నవి, వైష్ణవి, తుషార, షర్మిల, తదితరులను కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, ఏవో అభినందించారు.

టెన్నికాయిట్ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో తిరుపతి జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల టెన్నికాయిట్ జిల్లా జట్ల ఎంపిక ఆదివారం జరిగింది. జిల్లాలోని పలు విద్యాసంస్థల నుండి 50 మంది బాల బాలికలు ఈ ఎంపికలో పాల్గొన్నారు. ఈ ఎంపికలు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు బండి శ్యామసుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్) సెక్రటరీ గెరిటి చెంచయ్య, ట్రెజరర్ బుసగాని మహేష్, ఉపాధ్యక్షులు పైడి కోటేశ్వరరావు, కె.మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు పాల్గొని క్రీడలు వాటి ప్రాముఖ్యత గురించి మాట్లాడారు. మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రవికుమార్, కోదండపాణి, అనూష , కృష్ణయ్య , విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపికైనవారు ఈ నెల 21,22 తేదీ లలో శ్రీకాకుళం జిల్లా సొండిపూడినందు జరుగు రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

వీధి లైట్లు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: మంగళం రోడ్డు నుంచి కరకంబాడి వరకు గత ప్రభుత్వ కాలంలో, భూమన అభినయ రెడ్డి డిప్యూటీ మేయర్‌గా ఉన్నప్పుడు ఈ రోడ్డుపై అత్యవసరమైన వీధి లైట్లు ఏర్పాటు చేయడం జరిగింది. ఆ సమయంలో పోల్స్ మార్పులు, లైట్ల ఏర్పాటు వంటి పనులకు మొత్తం 12 లక్షల రూపాయలు టిటిడి ద్వారా డిడి ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్‌కు చేరవలసి ఉంది. బిల్ పెండింగ్‌లో ఉన్న సమయంలో ప్రభుత్వం మారడంతో, ఇప్పుడు కూటమి నాయకులు కావాలనే టిటిడి నుండి ఆ బిల్లు పంపకుండా అడ్డుపడుతున్నారు. ఫలితంగా వీధి విద్యుత్ దీపాలను నిలిపివేయడం జరిగింది. ఈ రహదారి పై ఉన్న డివైడర్లు - యూటర్న్ వద్ద లైట్లు లేకపోవడంతో రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రాజకీయ ధోరణితో కాక, ప్రజా సమస్యగా పరిగణించి లైట్లు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు సహకరించాలని స్థానికులు కోరుతున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం, అప్పంబట్టు గ్రామానికి చెందిన సి.పీ వాసుకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేశారు. ఆదివారం నారాయణవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్య బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డి ఇలంగోవన్ రెడ్డి, టీడీపీ బలరాం రెడ్డి, బాధితుడు వాసులు పాల్గొన్నారు.

ఉబ్బల మడుగు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బి.ఎన్.కండ్రిగ మండలం, కుక్కంభాకం సమీపంలోని ఉబ్బల మడుగు ప్రాజెక్ట్ వద్ద గత కొంతకాలంగా ప్రమాదాలు పెరుగుతున్నాయి. ప్రాజెక్ట్‌కు ఆనుకుని ప్రవహించే తెలుగు గంగ కాలువ కట్టపై ఇటీవల వరదయ్యపాలెం మండలానికి చెందిన కారు యజమాని, డ్రైవర్, 10 ఏళ్ల బాలుడు ప్రమాదవశాత్తు నీటిలో కొట్టుకుపోయారు. కారు యజమాని ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడగా, డ్రైవర్, బాలుడు మృతి చెందారు. ఇటువంటి ప్రమాదాలను అరికట్టేందుకు అధికారులు ఉబ్బల మడుగు కాలువ కట్టపై హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

క్రైం న్యూస్

ప్రాణం తీసిన ఈత సరదా

వెలికి తీసిన మృత దేహాలు, ఇన్‌సెట్‌లో ఫైల్ ఫోటోలు

ప్రజాశక్తి- రేణిగుంట (తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లా, రేణిగుంట మండలం, మల్లెమడుగు రిజర్వాయర్‌లో ఈతకు వెళ్లి ఇద్దరు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు, తిరుపతి, తాతయ్యగుంటకు చెందిన శివ (35), నరేష్ (36), శేఖర్ ముగ్గురు కలిసి ఆదివారం సరదాగా ఈత కొట్టేందుకు మల్లెమడుగు రిజర్వాయర్ వద్దకు వెళ్లారు. మొదట శివ నీటిలోకి దిగాడు. లోతు ఎక్కువగా ఉండడంతో మునిగిపోతుండగా కాపాడేందుకు నరేష్ కూడా నీటిలోకి దూకి ఈత కొట్టలేక మునిగి పోయాడు. శేఖర్ గమనించి రేణిగుంట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులతో కలిసి ఇద్దరి మృతదేహాలను వెలికి తీశారు. మృతుడు శివకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నరేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరిద్దరూ డ్రైవింగ్ పనులు, కూలీ పనులు వంటి చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రేణిగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.

జిల్లాలో ఆరుగురిపై పీడీ యాక్ట్

ఎస్పీ సుబ్బారాయుడు, ఏఎస్పి రవి మనోహరాచారి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: జిల్లాలో ఆరు మందిపై పిడి యాక్ట్ నమోదు చేసినట్టు ఎస్పీ సుబ్బారాయుడు తెలిపారు. తిరుపతి పోలీస్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరచరిత్ర గల వ్యక్తులపై పీడీ యాక్ట్ అమలు చేశామన్నారు. పదే పదే నేరాలలో పాల్గొంటున్న వారి సమాచారం సేకరించి ప్రత్యేక జాబితా తయారు రూపొందించామన్నారు. గూడూరుకు చెందిన షేక్ కాలేషా (33), కె.శ్రీహరి (38), తిరుపతికి చెందిన సయ్యద్ అజీమ్ (30), చిత్తూరు జిల్లా, పులిచర్ల మండలం, కమ్మపల్లికు చెందిన వట్టికుంట అరుణ్ (32), నెల్లూరు జిల్లాకు చెందిన మీధారి సునీల్ (29), సూళ్లూరుపేటకు చెందిన ప్రసన్న కుమార్ (32)లపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పి రవి మనోహరాచారి పాల్గొన్నారు.

లిక్విడ్ గంజాయి కలకలం

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, ఎగువ రెడ్డివారిపల్లి స్వర్ణముఖి నది పరిసరాల్లో లిక్విడ్ గంజాయి వినియోగం స్థానికులను తీవ్రంగా ఆందోళనకు గురిచేస్తోంది. గంజాయిని బాటిల్లో నింపి, పొగ బెట్టి ఆవిరి పట్టి పీల్చే విధానంతో యువకులు మత్తులో జోగుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మత్తులో చేస్తున్న వికృత చేష్టలకు భయభ్రాంతులకు గురవుతున్నామని తెలిపారు. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎర్రచందనం స్వాధీనం.. స్మగ్లర్లు అరెస్టు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): శేషాచలం అటవీ పరిధి, శ్రీకాళహస్తి మండల పరిధిలో రెండు వేర్వేరు కేసుల్లో 24 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్సు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఎస్ఐ టి.విష్ణువర్ధన్ కుమార్ బృందం శనివారం నుండి శ్రీకాళహస్తి మండలం బీటు పరిధిలో కూంబింగ్ చేపట్టారన్నారు. ఆదివారం ఉదయం సదాశివకోన ప్రాంతం చేరుకునే సరికి, కొంతమంది వ్యక్తులు ఎర్రచందనం దుంగలు మోసుకుని వస్తూ కనిపించారని, టాస్క్ ఫోర్సు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా వారిని వెంబడించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరు తమిళనాడులోని కల్లకురిచ్చి జిల్లాకు చెందిన వారిగా గుర్తించామన్నారు. ఆ ప్రాంతంలో పడి ఉన్న 15 ఎర్రచందనం దుంగలను తీసుకుని తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించామన్నారు.

తీర్థాలపాలకోన వద్ద..

తీర్థాలపాలకోన వద్ద ఏఆర్ఎస్ఐ కే.మహేశ్వరనాయుడు బృందం కూంబింగ్ చేపట్టగా ఆదివారం తెల్లవారు జామున కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు మోసుకుని వస్తూ కనిపించారని, టాస్క్ ఫోర్స్ పోలీసులను చూసి పారిపోతుండగా ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా అతను తమిళనాడులోని కల్లకురుచ్చి జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. సమీపంలో కిందపడి ఉన్న 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ రెండు ఘటనలకు సంబంధించి టాస్క్ ఫోర్స్ ఎస్పై రఫీ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి - నాయుడుపేట: గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమై దాదాపు 3 లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగి ఒక నిరుపేద కుటుంబం రోడ్డున పడ్డ సంఘటన ఆదివారం నాయుడుపేటలో చోటుచేసుకుంది. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని లోతివాణిగుంటలో ఎన్నో ఏళ్లుగా కాపురం ఉంటున్న సుబ్బమ్మకు చెందిన గుడిసెలో గ్యాస్ సిలిండర్ పేలి ఆమె పూరిల్లు పూర్తిగా దగ్ధం అయింది. గ్యాస్ సిలిండర్ పేలడంతో భయభ్రాంతులకు గురైన చుట్టుపక్కల వారు వెంటనే స్పందించి అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వగా, అగ్నిమాపక శాఖ వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు. ఇంటి నిర్మాణం కోసం బీరువాలో దాచుకున్న 2 లక్షల రూపాయల నగదు, బంగారు నగలు, ఇంటి సామాగ్రి మంటలకు ఆహుతి అయ్యాయి. కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలుసుబ్బమ్మ కోరారు.

తిరుమల రెండవ ఘాట్‌లో కారు బోల్తా

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల ఘాట్‌లో ప్రమాదం జరిగింది. శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు ఘాట్ రోడ్డులో కొండపైకి వెళ్తుండగా ఒక్కసారిగా వారు ప్రయాణిస్తున్న కారు బోల్తా పడింది. మలుపును డ్రైవర్ గమనించకపోవడంతో కారు అదుపు తప్పింది. కంట్రోల్ చేయకపోవడంతో బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు భక్తులకు గాయాలయ్యాయి. వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో ఘాట్ రోడ్డులో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రిసోర్స్ పర్సన్‌గా డాక్టర్ కుమార్ బాగేవాడి మఠ్

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఎడ్యుకేషన్ విభాగ అధ్యాపకులు డా.కుమార్ బాగేవాడిమఠ్ వారం రోజుల పాటు జరిగిన సంస్కృత భాషా నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా హాజరయ్యారు. శ్రీలంక అంతటా 250 పిరివేణాల నుంచి సంస్కృత ఉపాధ్యాయుల కోసం న్యూఢిల్లీలోని సెంట్రల్ సంస్కృత విశ్వవిద్యాలయం దీనిని నిర్వహించింది. శ్రీలంకలోని కొలంబోలోని పన్నిపిటియాలోని శ్రీ దేవ్రం మహా విహారయాత్రలో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం భారత-శ్రీలంక సంస్కృత మహోత్సవంలో భాగంగా శ్రీలంకలోని ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్, విద్యా మంత్రిత్వ శాఖలోని పిరివెన్ డివిజన్, భారత ప్రభుత్వ విదేశాంగ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖల సహకారంతో నిర్వహించారు. శ్రీలంకలోని కొలంబోలోని భారత హైకమిషనర్ వద్ద స్వామి వివేకానంద కల్చరల్ సెంటర్ డైరెక్టర్ ప్రొ.అంకురన్ దత్తా ప్రారంభ, ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ప్రొ.జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి డా.కుమార్ ను అభినందించారు. విశ్వవిద్యాలయంలోని వివిధ అధ్యాపకులు, విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలిపారు.

కార్యకర్తకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: రోడ్డు ప్రమాదంలో గాయపడి స్థానిక ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైసిపి కార్యకర్త రాజశేఖర్ రెడ్డిని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆయనకు మెరుగైన వైద్యం అందివ్వాలని వైద్యులకు సూచించారు. రాజశేఖర్ రెడ్డి త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాశించారు. మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, సూరా సురేష్, మల్లెంబాకం ముని కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - బాలాయపల్లి : ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నారాయణ తెలిపారు. మండలంలోని 24 పంచాయతీలలోని విద్యార్థుల బయో మెట్రిక్ అప్డేట్‌కోసం ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. 17 న నిడిగల్లు, పిగిలాం, 19, 20 న వెంగమాంబపురం, 19 నుండి22 వరకు జయంపు,21 నుండి 24 వరకు బాలాయపల్లి,24 నుండి 26 వరకు పిగిలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఆధార్ క్యాంపు లు నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిదంగా వెంగమాంబపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల లో 25,26 తేది లలో జరిగే క్యాంపులను వినియోగించు కోవాలన్నారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి రూరల్ మండలం, తిరుచానూరు పంచాయతీ, చైతన్య పురంలో ఆదివారం చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, కాలనీ యువతతో కలిసి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల ఉద్యమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఉధ్యమంలో పాల్గొని తమ సంతకంతో ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నరేష్‌రెడ్డి, పార్టీ నేతలు చింతల హరి, మహేష్, నిఖిల్, సునీల్, మోహన్, చంద్రశేఖర్ ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వైద్య విద్యను దూరం చేస్తే సహించం : చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

ప్రజాశక్తి - పాకాల: పేద విద్యార్థులకు ప్రభుత్వ వైద్య కళాశాలలను దూరం చేసి వైద్యవిద్యను చదవడానికి వీలులేకుండా చేస్తే సహించేది లేదని రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి హెచ్చరించారు. పాకాల పంచాయతీ పరిధిలోని పూరిపేట, ఇరంగారి పల్లి, పాలినేనివారిపల్లి గ్రామాల్లో కోటి సంతకాల కార్యక్రమంను ఆదివారం నిర్వహించారు. ఈ సదర్భంగా చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ప్రతి ఇంటికీ వెళ్లి కోటి సంతకాల సేకరణ ఎందకు చేయాల్సి వస్తోందన్న విషయాన్ని అందరికీ అర్థమయ్యేలా వివరించారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను తీసుకువచ్చి పేద విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పించారన్నారు. అందులో భాగంగా 17 కాలేజీల్లో 5 కాలేజీలను ప్రారంభించగా 12 కాలేజీలు వివిద దశల్లో నిర్మాణ పనులు ఆగిపోయాయన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ కాలేజీల నిర్మాణం పూర్తి చేస్తే పేద విద్యార్థులకు మెడికల్ సీట్లు ఉచితంగా వచ్చేస్తాయన్న అక్కసుతో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారన్నారు. అది కూడా 66ఏళ్లకు లీజు ఇవ్వడం వల్ల మూడు తరాలు పూర్తిగా మెడికల్ సీట్లును కోల్పోవడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం కుట్రలను భగ్నం చేసి పేదలకు మంచి జరగాలన్న లక్ష్యంతో రాజ్యాంగ పరిరక్షకులైన గవర్నర్‌కు ప్రజా ఉద్యమం ద్వారా ప్రజల అభిప్రాయాలను తెలపాలన్న లక్ష్యంతో కోటి సంతకాల కార్యక్రమంకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రజలు తమ సంతకంతో మద్దతు తెలిపి పేదలకు మంచి జరిగేలా చేయడానికి ముందుకు రావాలన్నారు. అనంతరం ప్రతి ఇంటికీ వెళ్లి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు, నంగా నరేష్ రెడ్డి, పాకాల పంచాయతీ పార్టీ అధ్యక్షులు మునీర్‌బాయ్, గుండ్లూరు సురేష్, హరిప్రసాద్ రెడ్డి, కపిలేశ్వర్‌రెడ్డి, కమల్‌బాయ్, అశోక్, ఆనందరెడ్డి, సద్దాం, బాబు, బేటా, ఖాదర్ వల్లి, హేమ, రజాక్, ఆశ్రఫ్ తదితరలు పాల్గొన్నారు.

శ్రీవారి మెట్టు వద్ద ఘనంగా కార్తీక వనభోజనం

ప్రజాశక్తి - చంద్రగిరి: పవిత్ర కార్తీకమాసం సందర్భంగా ఆదివారం చంద్రగిరి మండలం లోని శ్రీవారి మెట్టు వద్ద గల పార్వేట మండపంలో కార్తీక వనభోజన కార్యక్రమం జరిగింది. ఉదయం 7 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవరులను ఊరేగింపుగా పార్వేటిమండపానికి తీసుకొచ్చారు. స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. అనంతరం పార్వేట మండపంలో మధ్యాహ్నం 12 నుండి 2 గంటల వరకు కార్తీక వనభోజనోత్సవం జరిగింది.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయస్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో శ్రీమతి పి.వరలక్ష్మి, ఏఈవో శ్రీ గోపినాథ్, సూపరింటెండెంట్ లు శ్రీ రాజ్ కుమార్, రమేష్ బాబు, టెంపుల్ ఇన్స్పెక్టర్ లు శ్రీ ధనశేఖర్, శ్రీ ముని కుమార్, అర్చకులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

గ్రంథాల వారోత్సవాల సందర్భంగా కవి సమ్మేళనం

ప్రజాశక్తి - పాకాల: పాకాల గ్రంథాలయ వారోత్సవాలలో బాగంగా కవి సమ్మేళన కార్యక్రమం ఆదివారం గ్రంథాలయ ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ఎంఈఓ బాబ్జి వహించగా ప్రముఖ కవులు పత్తిపాటి రమేష్ నాయుడు,దామోదర ఆచారి ,రెడ్డిపల్లి షాజహాన్ అరవ జయపాల్ ,విమల ,రేజర్ల భాస్కర్ నాయుడు , నేర్చిత కవిత గానాన్ని వినిపించారు . కార్యక్రమం చాలా విజయవంతంగా ముగిసింది. కవులు సమాజ శ్రేయస్సును ప్రభావితం చేసే విధంగా కవితలు చదివి వినిపించారు . అనంతరం రవీంద్రబాబు వారికి అందరికి కూడా జ్ఞాపిక సేవలతో సన్మానం చేశారు. రిటైర్డ్ గ్రంథాలయ అధికారి సుబ్రహ్మణ్యం గారు మాట్లాడుతూ కవులు సమాజానికి ఉపయోగపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, హరి, ప్రభు, ఓ విశ్వనాథం , శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పట్టణంలో ఆదివారం గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మీనా కుమారి మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని, అన్ని పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు గ్రంథాలయంలో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు గ్రంథాలయానికి విచ్చేసి వారికి కావాల్సిన పుస్తకాలను పటించాలని, తద్వారా విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. శనివారం పుస్తక ప్రదర్శన ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ, సిబ్బంది సుజాత, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

కార్తీక వైభవం విశిష్టత

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, కోదండ రామ దేవస్థానంలో వాసవి చాలీసా, శివ చాలీసా సృష్టి కర్త బొగ్గరపు రాధాకృష్ణ మూర్తి భక్తులకు కార్తీక మాస వైభవంపై ప్రవచనం వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తిక మాసం ఆధ్యాత్మిక చైతన్యమును పెంపొందించే సమయం అన్నారు. ఈ కాలంలో శివుడు, కేశవుడు ఇద్దరిని పూజించడం ద్వారా జన్మ జన్మాంతర పాపలు నశిస్తాయని పురాణాలు చెబుతున్నాయనారు. భక్తులు తెల్లవారి జమున నదీ స్నానం చేయడం, దీపారాధన , రుద్రాభిషేకం, తులసి పూజ, విష్ణు సహస్ర నామ పారాయణం వంటి ఆచారాలను పాటిస్తారన్నారు. ముఖ్యంగా కార్తిక దీపం వెలిగించడం అత్యంత పుణ్య ప్రదమని తెలిపారు. ఈ నెలలో ఉపవాసం, ధ్యానం, భజనల ద్వారా ఆత్మ శుద్ధి సాధించ వచ్చని విశ్వాసం ఉందన్నారు. ఈ కార్యక్రమంలోసీనియర్ న్యాయవాది పి.వి. సాయి కుమార్ రెడ్డి, వసంత్ కుమార్, రామ సుబ్బారెడ్డి, మదనమేటి రమణయ్య, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా తోటవారి కార్తీక వనభోజన మహోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి, దివ్యరామంలో ఆదివారం తోట కుటుంబాల కార్తీక వన భోజన మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అఖిలభారత తోట వారి ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ వన పూజా మహోత్సవం సందర్భంగా తులసి, ఉసిరి మొక్కలకు పూజలు నిర్వహించి, కార్తీక దామోదర వ్రతం, కళ్యాణ మహోత్సవం, సుమంగళి పూజ, అర్చక స్వాములు గిరీష్ స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలశ స్థాపన చేసి, ఉసిరి, నేతి కార్తీక దీపాలను తోట కుటుంబాల వారు దంపతుల సమేతంగా దీపాలు వెలిగించి, నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ తోట కుటుంబాలలో ఆర్థికంగా వెనుక బడిన వారిని ఆదుకుంటామని, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తోట జయరామయ్య, తోట వెంకటేశ్వర్లు, తోట లక్ష్మీనారాయణ, తోట రామ్ సాయి, తోట చలం, తోట లోకేష్, తోట మధు సూధన్ జగదీష్ తదితరులు ఉమ్మడి తిరుపతి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పాల్గొన్నారు.

రక్తదానం చేయండి

ప్రజాశక్తి -కోట : రక్తదానం చేయండి.. ఆపదలో ఉన్న వారిని రక్షించండి అని గూడూరుకు చెందిన మెడి ప్లస్ బ్లడ్ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ మద్దిశెట్టి సురేష్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కే.రామిశెట్టి కోరారు. ఆదివారం కోట మండలం, చెందోడు గ్రామంలో విద్యా ప్రదాత స్వర్గీయ ముప్పవరపు వెంకటేశ్వరరావు, ఆదిలక్ష్మిల జ్ఞాపకార్థం మెడిప్లస్ బ్లడ్ సెంటర్ సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం ఎంవి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ముప్పవరపు విజయలక్ష్మి, మెడిప్లస్ నిర్వాహకులు ఎమ్.సురేష్, బ్లడ్ సెంటర్ ఇంచార్జ్ జే.వంశీధర్ రెడ్డి, టెక్నీషియన్లు చంద్రమౌళి, అనిల్, అశోక్‌లను సత్కరించారు.

మధుబాల మృతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండల పరిధి, భీమవరం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు కూరుపాటి సుధాకర్ చౌదరి వదిన మధుబాల మృతి చెందిన విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని స్థానికులతో కలిసి మధుబాల పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాదిరి నాగిరెడ్డి, గోపాల్ రెడ్డి, వెంకట రెడ్డి, పళని, కార్యకర్తలు పాల్గొన్నారు.

లంగ్ కేన్సర్ నివారణపై వార్షిక సదస్సు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కేన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్, టాటా కేన్సర్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఇండియన్ సొసైటీ ఫర్ స్టడీ ఆఫ్ లంగ్ కేన్సర్ వారిచే వార్షిక సదస్సును ఆదివారం తిరుపతిలో నిర్వహించారు. స్థానిక గ్రాండ్ రిడ్జ్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో టాటా క్యాన్సర్ కేర్ ఫౌండేషన్ చీఫ్ అడ్వైజర్ కైలాష్ శర్మ దేశంలో పెరుగుతున్న ఊపిరితిత్తుల కేన్సర్ కేసులు, అధునాతన చికిత్సా కేంద్రాల అవసరంపై చర్చించారు. ఎస్విఐసిసిఏఆర్ వైద్య సంచాలకుడి నాయకత్వంలో నిర్వహించిన శాస్త్రీయ వర్క్‌షాప్‌ను ప్రశంసించారు. చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ కుమార్ నందులా మాట్లాడుతూ టాటా ట్రస్టులు దేశవ్యాప్తంగా అందుబాటులో ఉండే, కేన్సర్ సేవలను అందించేందుకు అవలంబిస్తున్న వ్యూహాత్మక కార్యక్రమాలు, భాగస్వామ్యాలు, నిధుల వినియోగం గురించి వివరించారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వి. కుమార్ మాట్లాడుతూ కార్డియోవాస్కులర్, థొరాసిక్ సర్జరీ, ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్స పద్ధతులు కాలక్రమేణా ఎలా అభివృద్ధి చెందాయో వివరించారు. ఐఎస్ ఎస్ఎల్ సి అధ్యక్షులు డాక్టర్ దిగంబర్ బెహెరా మాట్లాడుతూ తొలిదశలో గుర్తింపు, లంగ్ క్యాన్సర్ స్క్రీనింగ్ అత్యంత కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దివ్య ఖోస్లా, డాక్టర్ నరేంద్ర హులికల్, డాక్టర్ లక్ష్మీ సాంధ్య, డాక్టర్ ప్రసాంత్ పెనుమాడు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - పుత్తూరు : నారాయణవనం మండలం, భీమునిచెరువు, సరోజమ్మ చారిటబుల్ ట్రస్ట్‌లో ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ వారు ఆదివారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ రవిరాజు, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ సరోజమ్మ, ట్రస్టీ సుకన్య పాల్గొన్నారు. డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ ఆరోగ్యానికి నడక ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, అమరా హాస్పిటల్ డాక్టర్ అనుదీప్, డాక్టర్ శాంతి, క్యాంపు ఆఫీసర్ హేమకుమార్, పిఆర్ఓ లోకేష్, ఆస్టర్ నారాయణద్రి హాస్పిటల్ డాక్టర్ సాయిరాం తేజ, పిఆర్ఓ మౌళి, స్టాఫ్ సుగుణ, వాసన్ ఐ కేర్ హాస్పిటల్, తిరుపతి డాక్టర్ వెంకటేష్, టెక్నీషియన్ మంజనాథ్‌లు వైద్య సేవలందించారు.